ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 11 సెప్టెంబరు 2024

వేనాడు దర్గాలో గంధోత్సవ సందడి



పోలేరమ్మ జాతరకు నేడు చాటింపు

వెంకటగిరి పోలేరమ్మ జాతరకు బుధవారం చాటింపు వేయనున్నారు. ఈ నెల 25,26 తేదీల్లో నిర్వహించే జాతరకు ఆనవాయితీ ప్రకారం పనిబాట్ల వారికి జాతర నిర్వహణకు అనుమతులు ఇస్తూ వెంకటగిరి రాజాలు నగిరి తాంబూలం అందించనున్నారు. అలాగే పోలేరమ్మ రాకను తెలియజేస్తూ బుధవారం అర్ధరాత్రి కాంపాళెం వద్ద ఉన్న కామాక్షమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఎట్టివారు వెంకటగిరి పాత పంచాయతీ హద్దుల్లో దండోరా వేయనున్నారు. 'ఈ బుధవారం కాకుండా ఆపై బుధవారం అమ్మవారు కొలువు దీరనున్నారహో' అంటూ డప్పు కొట్టి చాటింపు వేస్తారు. తొలి చాటింపు వేసిన నాటినుంచి ఊర్లో ఎటువంటి శుభకార్యాలు నిర్వహించకపోవడం ఇక్కడ ఆనవాయితీ. అదేవిధంగా తొలిచాటు సందర్భంగా వెంకటగిరి పాత పంచాయతీలో నిద్ర చేసిన వారు తప్పనిసరిగా జాతరలో అమ్మవారి విరూపోత్సవం వరకు ఉండి పోవాలన్నది మరో ఆనవాయితీ.బయట ప్రాంతాలకు పనుల నిమిత్తం వెళ్లే వారు చాటింపు వేయకముందే వెళ్లిపోవడం, అదే రోజు రాత్రి బయట నిద్రచేయకుండా ఇంటికి చేరుకోవడం ఇంకో ఆనవాయితీ.పోలేరమ్మ జాతర ఏర్పాట్లపై మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.అన్ని శాఖల అధికారులకు కలెక్టర్ సూచనలు ఇచ్చారు.

- వెంకటగిరి



తడ, సెప్టెంబరు 10: తడ మండలంలోని వేనాడులో వున్న షేక్ దావూద్ షా వలీ అల్లా తాత దర్గా 29వ గంధోత్సవం మంగళవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమైంది. 144 అడుగు పొడవున్న బాబా సమాధిని ప్రత్యేక విద్యుత్ లైట్లు, కడప నుంచి తెప్పించిన పుష్పాలతో అలంకరించారు.దర్గా ప్రాంగణమంతా విద్యుద్దీపాలంకరణ కాంతులతో వెలిగిపోతోంది. ఉదయం నుంచే దర్గాకు మన రాష్ట్రం నుంచే కాకుండా తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు.ఉర్దూ ఖవ్వాలి, పకీర్ల డప్పుల విన్యాసాలు సందడి చేశాయి. మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన గంధ మహోత్సవాలు బుధవారం తెల్లవారుజామున ముగిశాయి. మంగళవారం రాత్రి గ్రామంలోని పీర్ల చావడి వద్ద మతపెద్దల ఆధ్వర్యంలో ప్రార్థనలు, పూజలు జరిగాయి.గంధాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు.తెల్లవారుజామున దర్గాకు చేరుకుని సమాధి చుట్టూ గంధం బిందెతో ప్రదక్షిణ చేశాక తల భాగాన గంధం లేపనం చేశారు.



దర్గాలో పూజలు ప్రారంభించేందుకు చద్దరు తీసుకెళ్తున్న హిందువులు



మూషిక వాహనంపై వినాయకుడు

కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి బ్రహోత్సవాలలో భాగంగా మంగళవారం మూషిక వాహన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, కాణిపాకపట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె గ్రామాలకు చెందిన విశ్వకర్మ వంశస్థులు ఉభయదారులు గా వ్యవహరించారు. ఉదయం మూల విరాట్‌ను ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకించారు. అనంతరం స్వామిని పూర్తిగా చందనంతో కప్పి ఆకృతి కనపడేలా ఉలెన్ దారాలను వినియోగించారు. దీంతో స్వామి రూపం స్పష్టంగా భక్తులకు కనబడుతుంది.స్వామికి చందనాలంకారం నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకొచ్చి అలంకార మండలంలో ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించారు. ఆ తర్వాత సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవమూర్తులను మూషిక వాహనంపై ఉంచి పురవీధులలో ఊరేగించారు.

కాణిపాకంలో నేడు

వరసిద్ధుడికి బుధవారం ఉదయం బంగారు చిన్న శేషవాహనం, రాత్రి బంగారు పెద్ద శేషవాహన సేవలు నిర్వహించనున్నారు. దీనికి కాణిపాకం, కాకర్లవారి పల్లె, వడ్రాంపల్లె, మిట్టఇండ్లు, కొత్తపల్లె, అడపగుండ్లపల్లె, 44బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాలకు చెందిన కమ్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.

- ఐరాల(కాణిపాకం)



వరద బాధితులకు ఆర్థిక సాయం

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 10 : విజయవాడ వరద బాధితుల సహాయార్థం డీఎంహెచ్‌వో శ్రీహరి తన జీతంలో నుంచి రూ. 25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ నగదు చెక్కును మంగళవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి అందించారు.



తెలంగాణ పారిశ్రామికవేత్త రూ.50లక్షలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10:తెలంగాణకు చెందిన రైజ్‌పవర్ కంపెనీ అధినేత గరుడపల్లి సంజయ్‌గుప్తా, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మంగళవారం మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు.వరద బాధితుల సహాయార్థం రూ.50లక్షల చెక్కును ఆయనకు అందజేశారు.



'విజయవాణి' తరపున రూ.25లక్షలు

చౌడేపల్లె, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితుల సహాయార్థం చిత్తూరు జిల్లా చౌడేపల్లెలోని విజయవాణి విద్యాసంస్థల యాజమాన్యం సీఎం సహాయ నిధికి రూ.25 లక్షల విరాళం అందజేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మంగళవారం విజయవాడలో మంత్రులు నారా లోకేశ్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆ సంస్థ అధినేతలు నాయిని మహేశ్‌కుమార్, శశికుమార్, హర్ష అందజేశారు.

తీరంలో గల్లంతైన యువకుడి మృతి

కోట/ వాకాడు, సెప్టెంబరు 10:వాకాడు మండల పరిధిలోని తూపిలిపాళెం సముద్రతీరంలో సోమవారం వినాయక ప్రతిమను నిమజ్జనం చేస్తూ గల్లంతైన ఎలక్ట్రీషియన్ మునిరాజ (23) మృతదేహం మంగళవారం లభ్యమైంది.నాయుడుపేట పట్టణం కావమ్మ గుడి సెంటర్‌కు చెందిన మునిరాజ యువకులతో కలసి వినాయక నిమజ్జనానికి తూపిలిపాళెం సముద్రతీరానికి సోమవారం వచ్చాడు. నిమజ్జనం చేస్తుండగా అలల తాకిడికి మునిరాజతో పాటూ అతని మిత్రులు ఫయాజ్, శ్రీనివాసులు కొట్టుకుపోయారు. వారిలో శ్రీనివాసులను మెరైన్ పోలీసులు రక్షించగా, ఫయాజ్ ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఈక్రమంలో గల్లంతైన మునిరాజ మృతదేహం మంగళవారం మధ్యాహ్నం కోట మండలం శ్రీనివాససత్రం సమీపంలోని సముద్రంలో తేలాడుతుండగా గుర్తించిన మత్స్యకారులు ఒడ్డుకు చేర్చారు.తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో భవాని, పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు, కోట ఎస్ఐ పవన్‌కుమార్, వాకాడు ఎస్ఐ నాగబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గల్లంతైన మునిరాజ మృతదేహం

వీఆర్‌కు తిరుమల టూ టౌన్ సీఐ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10: తిరుమల టూ టౌన్ సీఐగా మూడు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన మురళీమోహన్‌ను మళ్ళీ వీఆర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎస్వీ యూనివర్శిటీ సీఐగా మురళీమోహన్ పనిచేశారు. తెలుగుయువత శ్రేణులు గత ఏడాది అప్పటి ముఖ్యమంత్రి జగన్ దిష్టిబొమ్మను స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద దహనం చేశాయి.ఈ ఘటనపై యూనివర్శిటీ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.తెలుగు యువత నేతలు ఈ విషయాన్ని తాజాగా అమరావతి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వైసీపీకి సీఐ మురళీమోహన్ గతంలో ఏ విధంగా సహాయ సహకారాలందించారో వివరించారు.ఈ నేపథ్యంలో మురళీమోహన్‌ను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులొచ్చినట్లు సమాచారం.తిరుమల క్రైం సీఐగా పనిచేస్తున్న శేషగిరిని టూటౌన్‌కు ఇన్‌చార్జి సీఐగా నియమించారు.

ఎక్సైజ్ శాఖకు పూర్వ వైభవం

అక్టోబర్‌నుంచి 12 సెబ్ సర్కిళ్లు ఎక్సైజ్ పరిధిలోకి

ఉమ్మడి జిల్లాకు డీసీ నియామకం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో(సెబ్) కనుమరుగు కానుంది.ఎక్సైజ్ శాఖ లో సెబ్‌ను విలీనం చేస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. దీంతో అక్టోబరు నుంచి జిల్లాలోని 12 సెబ్ స్టేషన్లు ఎక్సైజ్ స్టేషన్లుగా రూపాంతరం చెందనున్నాయి. తిరుపతి, తిరుపతి రూరల్, చంద్రగిరి, శ్రీకాళహస్తి, పుత్తూరు, సత్యవేడు, నాగలాపురం, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వాకాడు, వెంకటగిరి సెబ్ స్టేషన్లను అక్టోబరు నుంచి ఎక్సైజ్ స్టేషన్లుగా మార్చి స్టేషన్‌కో సీఐ స్థాయి అధికారిని నియమించనున్నారు. వీరి పరిధిలో స్టేషన్ స్థాయిని బట్టి ఇద్దరు ఎస్ఐలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 10 మంది కానిస్టేబుళ్లు ఉంటారు. వీరు కాకుండా హోంగార్డులను కొంతమందిని నియమించే అవకాశాలున్నాయి. త్వరలో ప్రవేశ పెట్టనున్న ప్రైవేటు మద్యం షాపులు, బార్లు వీరి పరిధిలోకి రానున్నాయి.దీనికోసం ప్రతి రెండు జిల్లాలకు కలిపి ఒక డిప్యూటీ కమిషనర్‌ను ప్రభుత్వం నియమించనుంది. దీంతో ఎక్సైజ్ శాఖకు పూర్వ వైభవం రానుంది.

అమెరికన్ యూనివర్సిటీలో ఎస్వీయూ ప్రొఫెసర్ల బృందం

● 20 రోజుల పాటు అధ్యయనం చేసే అవకాశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10: అమెరికాలోని పార్డ్యూ యూనివర్సిటీలో ఎస్వీయూనివర్సిటీకి చెందిన ఆరుగురు ప్రొఫెసర్ల బృందం పర్యటిస్తోంది. ఈ నెల 7వ తేదీ తిరుపతి నుంచి బయలుదేరిన ఈ బృందం అమెరికాకు చేరుకుంది. ఈక్రమంలో అమెరికాలోని పార్డ్యూ యూనివర్సిటీతో గతంలో చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా ఈ పర్యటన కొనసాగుతూ ఉంది. ఈ పర్యటనకు రుసా నిధులు వెచ్చించనుంది. 20 రోజుల పాటు సాగే ఈ పర్యటనలో భాగంగా పార్డ్యూ యూనివర్సిటీలో అమలవుతున్న బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో పురోగతిని అధ్యయనం చేయనుంది. తద్వారా ఆ వర్సిటీతో ఎంటర్‌ప్రైనర్‌షిప్ కొలాబరేషన్‌కు ప్రయత్నం సాగుతుంది. ఈ బృందంలో రుసా సీఈవో రాయల వంశీకృష్ణ, రుసా కో-ఆర్డినేటర్లు ప్రొఫెసర్ టి. రమాశ్రీ (ఈసీఈ విభాగం, ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ), ప్రొఫెసర్ వి. ఉషారెడ్డి (ఈఈఈ విభాగం, ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీ), ప్రొఫెసర్ ఎం.హేమ (వైరాలజీ విభాగం), ప్రొఫెసర్ కె.సుమకిరణ్ (ఇంగ్లీషు విభాగం), ప్రొఫెసర్ కె.వి.సుచరిత (హోం సైన్స్ విభాగం) ఉన్నారు. ఈ పర్యటన పూర్తయ్యాక అమెరికాలోని పార్డ్యూ యూనివర్సిటీ ప్రతినిధులు కూడా ఎస్వీయూనివర్సిటీని సందర్శించి, కొలాబరేషన్‌పై అధికారిక నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకోసం ప్రస్తుత పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది.



పార్డ్యూ యూనివర్సిటీలో ఎస్వీయూ ప్రతినిధుల బృందం

పాకాల సబ్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారిణిగా పూర్ణిమ

కందుకూరు, సెప్టెంబరు 10 : నెల్లూరు జిల్లా కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిణి పెళ్లకూరు పూర్ణిమను చిత్తూరు జిల్లా పాకాలకు బదిలీ చేస్తూ హైకోర్టు పరిపాలనా విభాగ అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మంగళగిరిలోని జ్యుడిషియల్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న పూర్ణిమ ఒంగోలు జిల్లా కోర్టులో జరిగే ప్రయోగాత్మక శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత పాకాలలో బాధ్యతలు స్వీకరించాలని పేర్కొన్నారు.

మహిళా యూనివర్సిటీలో పీజీ అడ్మిషన్లకు గడువు పెంపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10:మహిళా యూనివర్సిటీలో పీజీ ప్రవేశ గడువును ఈ నెల12వ తేదీ దాకా పొడిగించారు.ఏపీపీజీసెట్ ర్యాంకు పొంది, పద్మావతి వర్సిటీలో సీట్ కేటాయింపు పొందిన వారు ఈ నెల 12వ తేదీ లోపు ప్రవేశం పొందవచ్చని పీఆర్వో శ్రీరజని తెలిపారు.ఈ నెల 10వ తేదీ వరకు తొలుత గడువు విధించామని, విద్యార్థుల సౌకర్యార్థం 12వ తేదీ దాకా పొడిగించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



వినోద్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

నగరి, సెప్టెంబరు10: నగరి మున్సిపాలిటీ పరిధిలోని నత్తంకండ్రిగకు చెందిన కానిస్టేబుల్ వినోద్‌కుమార్ (32) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన నింద్ర పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై నగరి వస్తుండగా మార్గమధ్యలో ఫ్రైడ్‌ఇన్ హోటల్ వద్ద ఎదురుగా వస్తున్న సిమెంటు లారీ ఓవర్‌టేక్ చేయబోయారు. ఈక్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో లారీ ఢీకొంది. దీంతో వినోద్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందారు. ఈయన భార్య కళావతి ముడిపల్లి సచివాలయంలో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వినోద్‌కుమార్ మృతితో నెత్తంకండ్రిగలో విషాదఛాయలు అలముకున్నాయి.

శ్రీవారిమెట్టు మార్గంపై టీటీడీ శీతకన్ను!

● కాలినడకన వెళ్ళే భక్తులకు దర్శన టోకెన్ల కొరత ● తీవ్ర ఇబ్బందులు పడుతున్న శ్రీవారి భక్తులు



దర్శన టోకెన్ల కోసం శ్రీనివాసమంగాపురంలో వేచి ఉన్న భక్తులు

చంద్రగిరి, సెప్టెంబరు10 : శ్రీవారిమెట్టు మార్గం అభివృద్ధిపై టీటీడీ శీతకన్ను వేసిందని భక్తులు ఆరోపిస్తున్నారు. తిరుమల శ్రీవారి దర్శనానికి శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన వెళ్లే భక్తులకు దర్శన టోకన్లు జారీలో టీటీడీ రోజుకొక విధంగా వ్యవహరిస్తోంది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో శ్రీవారి మెట్టు మార్గంలో రోజూ 6 వేల దర్శన టోకెన్లు జారీ చేసేవారు. ప్రత్యేక పర్వదినాల్లో 15 వేల టోకన్ల వరకు పంపిణీ చేసేవారు. దీంతోపాటు తిరుపతి రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు నుంచి శ్రీవారి ఉచిత రథాలు శ్రీవారి మెట్టు మార్గానికి సుమారు 10 ట్రిప్పులు వచ్చి వెళ్ళేవి. 2021 నవంబరులో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీవారిమెట్టు మార్గం కోతకు గురైంది. అంతేకాకుండా కొవిడ్ కారణంగా సుమారు నాలుగేళ్ళపైగా శ్రీవారిమెట్టు మార్గం మూసివేశారు. అయితే టీటీడీ మరమతులు చేసి, గతేడాది మే 5వ తేది నుంచి శ్రీవారిమెట్టు మార్గం నుంచి భక్తులను అనుమతిస్తున్నారు. ఈ మార్గంలో రోజుకు సుమారు పదివేలకుపైగా భక్తులు తిరుమలకు వెళుతుంటారు. అయితే టీటీడీ రోజుకు ఒక విధంగా 2 వేలు, మూడు వేలు, మాత్రమే దర్శన టోకెన్లు జారీ చేస్తున్నారు. దీంతో భక్తులు టోకెన్లు లేకపోవడంతో ఎంతో మంది నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇకనైనా టీటీడీ అధికారులు స్పందించి శ్రీవారి మెట్టు మార్గంలో భక్తులకు దర్శన టోకెన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుని, అధిక సంఖ్యలో ఉచిత బస్సులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.



శ్రీవారిమెట్టు మార్గం

ప్రైవేటు వాహనాల దందా... : తిరుపతి నుంచి శ్రీవారిమెట్టు వరకు టీటీడీ ఉచిత రథాలు(బస్సులు) అధిక సంఖ్యలో లేకపోవడంతో ప్రైవేటు వాహనాల దందా పెరిగిపోయింది. శ్రీవారి మెట్టు మార్గంలో దర్శన టోకెన్లు తక్కువ ఇవ్వడం వలన భక్తులు వేకువ జామునే శ్రీనివాసమంగాపురానికి చేరుకుంటున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు వాహనాలు దందా మొదలైంది. వేకువజామున తిరుపతి నుంచి ఉచిత రథాల సౌకర్యం లేకపోవడం వలన ప్రైవేటు వాహనాల డ్రైవర్లు అధిక సంఖ్యలో భక్తుల నుంచి వసూలు చేస్తున్నారు. ప్రతి రోజూ అద్దె వాహనదారులు తమ బాడుగుల కోసం ఘర్షణలు పడుతుంటారు. దీంతో భక్తులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కావున టీటీడీ భక్తుల సౌకర్యార్థం వేకువజామున తిరుపతి నుంచి చంద్రగిరి మీదుగా శ్రీవారి మెట్టు వరకు ఉచిత రథాలను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. అలాగే పెరటాసి నెల రానున్నడంతో భక్తుల సౌకర్యార్థం టీటీడీ తాత్కాలికంగా వసతి సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. భక్తులు రాత్రి వేళల్లో నిద్రించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో టీటీడీ భక్తుల కోసం డార్మేటరీ నిర్మించాలని కోరుతున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.60 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.60 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 67,030 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 23,476 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

చంద్రబాబుపై జగన్ విమర్శలు దారుణం



● ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలతో వచ్చిన వరదలపై సీఎం చంద్రబాబుపై జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు తగదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రకృతిపరంగా జరిగిన దానికి ఎవరు కారణం కాదన్నారు. కొన్ని చోట్ల వర్షాలతో ఇబ్బందులు తలెత్తినప్పటికీ రాయలసీమ వంటి ప్రాంతాల్లో మంచి పంటలతో రైతులు బాగున్నారన్నారు. ఇక, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అంత వయసులోనూ సీఎం చంద్రబాబు ప్రజలకు మేలు చేసేలా చేస్తున్న కృషి అద్భుతమన్నారు. ఈక్రమంలో ఆయనకు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు. అలాగే రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రార్థించానన్నారు.

శ్రీవారి సేవలో రవిశంకర్



తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్నారు.ఆలయంలోని రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

4 నుంచి శ్రీనివాస వేద విద్వత్ సదస్సు

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ శ్రీవేంకటేశ్వర ఉన్నత వేద అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ప్రముఖ పండితులతో శ్రీనివాస వేద విద్వత్ సదస్సు నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం 5 నుంచి 6.30 గంటల వరకు చతుర్వేద పారాయణం, ప్రముఖ పీఠాధిపతులు, మఠాధిపతులు, వేదపండితులతో వేద విజ్ఞానంపై సదస్సు నిర్వహించనున్నారు. వేదాలలోని ఆధునిక విజ్ఞానం, సనాతన ధర్మం, పురుషార్థాలు, వేదభాష్యం, భగవత్ తత్వం, వేదం-వేదాంగాలు, వేదం-ఉపనిషత్తుల సందేశం తదితర అంశాలపై ఉపన్యాసించనున్నారు.

సి.మల్లవరంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 10: తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీలో శ్రీవేంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్డ్ రీసెర్చ్(టాటాట్రస్ట్), రాష్ట్రీయ సేవాసమితి(రాస్)సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. దాదాపు 150మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈశిబిరాన్ని గ్రామసర్పంచ్ మొక్కల భారతితో రాస్ మహిళా పొదుపు సంఘాల ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.నాగరాజు కలసి ప్రారంభించారు. నాగరాజు మాట్లాడుతూ..బరువుతగ్గడం, జ్వరం, దగ్గు వస్తుండడం, నిరంతరం తలనొప్పి, మూత్రనాళంలో రక్తరావడం, నీరసంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించి మందులు వాడాలని తెలిపారు. డాక్టర్ వెంకయ్యబాబు, ఉపసర్పంచ్ సహనాజ్, పంచాయతీ కార్యదర్శి దుశ్యంత్‌రెడ్డి, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరదప్రాంతాల సహాయక చర్యల్లో ఎమ్మెల్యే పులివర్తి నాని



బాధితులకు సాయం చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుచానూరు, సెప్టెంబరు 10: విజయవాడ తూర్పు నియోజకవర్గం 22వ డివిజన్ కృష్ణలంక ముంపు ప్రాంతాల్లో మంగళవారం రెండవ రోజు కూడా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాధితులను రక్షించే ప్రయత్నంలో మృతి చెందిన చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ప్రజలను పలుకరిస్తూ వారి బాధలను తెలుసుకున్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

భాకరాపేట, సెప్టెంబరు 10: ప్రభుత్వం అమలు చేస్తున్న 100 రోజుల శ్యానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీఆర్‌ఈ కిశోర్ కుమార్ తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టిచెర్ల, దేవరకొండ పంచాయతీలలోని చెత్త సంపద కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, క్లాప్ మిత్రులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీలోపల ప్రతి చెత్త సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి గ్రామాలలో చెత్తను సేకరించి ఎరువులు తయారు చేసి పంచాయతీల ఆదాయాన్ని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నాగచంగమ నాయుడు, విజయ కుమార్, మండల కో-ఆర్డినేటర్ గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

హిందీ అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

భాకరాపేట, సెప్టెంబరు 10: చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికపై హిందీ సబ్జెక్టు బోధనకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పోస్టు గ్రాడ్యుయేషన్ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల వారు సర్టిఫికెట్లతో ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

తిరుమలలో కేంద్రమంత్రి, కర్ణాటక గవర్నర్



అతిథిగృహంలోకి వెళుతున్న సురేష్‌గోపి - తావర్‌చంద్ గెహ్లాట్

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): కేంద్ర పెట్రోలియం, సహజ వాయువులు, టూరిజం సహాయమంత్రి సురేష్‌గోపి శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చారు. సాయంత్రం తిరుమలలోని రచన అతిథిగృహానికి ఆయన చేరుకున్నారు. అలాగే రాత్రి 7 గంటలకు కర్ణాటక రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ కూడా తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకున్నారు. ఈమేరకు వీరికి టీటీడీ రిసెప్షన్ డిప్యూటీఈవో ఆర్. భాస్కర్, ఓఎస్డీ సత్రేనాయక్ పుష్పగుచ్ఛంతో స్వాగత పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. కాగా, మంత్రి సురేష్‌గోపి, గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ బుధవారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

స్థానికులకు బాలాజీనగర్‌లోని ఇళ్లు కేటాయించండి

టీటీడీ ఈవోకు స్థానిక ఎమ్మెల్యే విజ్ఞప్తి



ఈవోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తిరుమల, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవో శ్యామలరావుతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మంగళవారం తిరుపతిలోని ఏడీ బిల్డింగ్‌లో సమావేశమయ్యారు. స్థానికుల సమస్యలపై ఈవోకు వినతిపత్రాన్ని అందజేశారు. తిరుమలలోని పూటకూళ్లమిట్ట, సతురామ్ మఠానికి చెందిన 84 కుటుంబాలు ప్రస్తుతం రిహాబిలిషన్ సెంటర్‌లో నివాసముంటున్నాయని, వీరికి తిరుమలలోని బాలాజీనగర్‌లో ఇళ్లు కేటాయించాలని కోరారు. అలాగే కపిలతీర్థంలో అమావాస్య రోజుల్లో స్థానికులు పితృదేవతలకు పూజలు చేసేందుకు తాత్కాలింకంగా స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. టీటీడీ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు.

హెల్మెట్ల వినియోగంపై ఘాట్‌రోడ్డులో తనిఖీలు

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్డులో ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు వినియోగిస్తున్నారా లేదా అనే అంశంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రమాదాల నివారణ కోసం టీటీడీ కొన్నేళ్లుగా ఘాట్‌రోడ్లలో హెల్మెట్ వినియోగం తప్పనిసరి నిబంధనను అమలుచేస్తున్న విషయం తెలిసిందే. అయితే తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రయాణించే తిరుమల స్థానికులు, వ్యాపారులు, ఉద్యోగులు అలిపిరి చెక్‌పాయింట్, జీఎన్సీ టోల్‌గేట్లతో తనిఖీల వరకే హెల్మెట్ పెట్టుకుని ఆ తర్వాత తొలగించి ప్రయాణిస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ఆగస్టు 26న 'హెల్మెట్ ఏదీ గోవిందా..!' అనే శీర్షిక కథనం ప్రచురించింది. దీంతో తిరుమల డీఎస్పీ విజయ్‌శేఖర్, ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ ఇప్పటికే పలుమార్లు తిరుమలలోని జీఎన్సీ, అలిపిరి చెక్‌పాయింట్ వద్ద ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయితే ఇప్పటికీ కొంతమంది ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను వినియోగించడం లేదనే సమాచారంతో ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ మంగళవారం మొదటి ఘాట్‌రోడ్డు మధ్యలోని హరిణి ప్రాంతంలో సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్లు పెట్టుకోకుండా ప్రయాణిస్తున్న వారిని నిలిపి అవగాహన కల్పించారు. ఇకపై తప్పనిసరిగా హెల్మెట్లు ధరిస్తామని, ఎట్టిపరిస్థితుల్లోనూ హెల్మెట్లు లేకుండా ప్రయాణించమని వారితో ప్రమాణం చేయించారు. మరోసారి హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



హెల్మెట్ల వినియోగంపై ప్రమాణం చేయిస్తున్న సీఐ

వేడుకగా ఆలయ శుద్ధి

● 16 నుంచి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు



తిరుచానూరు, సెప్టెంబరు 10: తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 16 నుంచి మూడు రోజులపాటు వార్షిక పవిత్రోత్సవాలు జరగనున్నాయి. అందులో భాగంగా మంగళవారం ఆలయంలో కోయల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉద్యోగులు, అర్చకులు సుగంధ పరిమళ ద్రవ్యాలతో కలిపిన పవిత్ర జలాలతో ఆలయంలో ప్రోక్షణ చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఇక ఈనెల 15న అంకురార్పణతో అమ్మవారి వార్షిక పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 16న పవిత్ర ప్రతిష్ఠ, 17న పవిత్ర సమర్పణ, 18న పూర్ణాహుతితో ఉత్సవాలు ముగియనున్నాయి. పవిత్రోత్సవాలు పురస్కరించుకుని పై నాలుగు రోజులు ఆర్జితసేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన స్వర్ణకుమార్‌రెడ్డి అనే భక్తుడు 11 పరదాలను కానుకగా అందించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కోనాటి సురేష్‌కు ఘన సన్మానం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 10: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకున్న శ్రీకాళహస్తి ఊరందూరు పాఠశాల ఉపాధ్యాయుడు కోనాటి సురేష్‌ను కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఘనంగా సత్కరించారు. డీఈవో శేఖర్‌తో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో కోనాటి సురేష్‌కు దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి కలెక్టర్ అభినందనలు తెలిపారు. అలాగే ప్రేరణ కార్యక్రమం కింద గుజరాత్‌లో ప్రధానమంత్రి మోదీ చదివిన పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న వరదయ్యపాళెం మండలం, సంతవేలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎన్‌వీ లత, విద్యార్థులు ఝాన్సీ, కిషోర్ నాయక్‌ను, అలాగే ఆగస్టు 15న ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా వెళ్లిన తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు చంద్రకుమారి, విద్యార్థి జీవీ శేషిరెడ్డిలను కలెక్టర్ సన్మానించి అభినందించారు.



వరదయ్యపాళెం మండలం, సంతవేలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎన్‌వీ లత, విద్యార్థులు ఝాన్సీ, కిషోర్ నాయక్‌ను - తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు చంద్రకుమారి, విద్యార్థి జీవీ శేషిరెడ్డిలను - జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కోనాటి సురేష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

కలిగిరి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

చిత్తూరు రూరల్/చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 10: పెనుమూరు మండలం కలిగిరి పంచాయతీ కార్యదర్శి లావణ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ పంచాయతీలో పలు పనులకు సంబంధించి రూ.1.5 లక్షలకుపైగా నిధు లు దుర్వినియోగం చేసినట్లు పంచాయతీకి చెందిన పలువురు డీపీవో,కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.దీనిపై జూలై 31వ తేదీన లావణ్యకు డీపీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసుకు ఎటువంటి సంజాయిషీ ఇవ్వకపోవడంతో అధికారులు విచారణకు ఆదేశించారు. ఆ విచారణలో పలు పనులకు సంబంధించి నకిలీ బిల్లులు సమర్పించి నిధులను దుర్వినియోగం చేసినట్లు తేలడంతో ఆమెను సస్పెండు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సమాచార హక్కు చట్టంతో బయటపడ్డ అవినీతి

కలిగిరి పంచాయతీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న లావణ్య హయాంలో పలు అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగినట్లు అదే పంచాయతీకి చెందిన యుగంధర్ 2023లోనే సమాచార హక్కు చట్టం కింద వివరాలు సేకరించారు. ఆ సమాచారంతోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో జడ్పీ చైర్మన్, జడ్పీ సీఈవోకు ఏక కాలంలో సీసీగా ఉన్న లావణ్య భర్త సురేంద్రరెడ్డి తన పలుకుబడిని వినియోగించి ఆమెపై చర్యలను ఆపారన్న విమర్శలున్నాయి. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఆమెపై ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సస్పెండు చేసినట్లు తెలుస్తోంది. కలిగిరికి ముందు పెనుమూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేసినప్పుడూ పెద్ద ఎత్తున అవినీతి జరిగిందన్న ప్రచారం ఉంది.

టమోటా ముసుగులో

రేషన్ బియ్యం అక్రమ రవాణా

గంగవరం, సెప్టెంబరు 10: పైకి టమోటా బాక్సులు పెట్టి.. ఈ ముసుగులో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సమాచారం అందడంతో గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చిన్నూరు ఫ్లైఓవర్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. చిత్తూరు నుంచి పలమనేరు వైపు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా.. వెనుక వైపు టమోటా ఖాళీ బాక్సులు దర్శనమిచ్చాయి. ఎక్కడికి వెళ్తున్నావని వాహన డ్రైవర్‌ను పోలీసులు ప్రశ్నించగా అతడు తడబడాడు. దీంతో పోలీసులకు అనుమానం వచ్చి టమోటా బాక్సులను కిందికి దించి చూడగా, రేషన్ బియ్యం బయటపడింది. వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. వాహనంలో సుమారు మూడు వేల కిలోల ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన రేషన్‌బియ్యం, స్టీమ్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు సమాచారమిచ్చారు. బియ్యం రవాణాలో కీలక పాత్ర పోషించిన గణేష్, జిలానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాద్ తెలిపారు.



టమోటా బాక్సుల ముసుగు తొలగించడంతో బయటపడ్డ రేషన్ బియ్యం

వారాహి అలంకారంలో శ్వేతగణపతి



రామచంద్రాపురం, సెప్టెంబరు 10: రాయలచెరువుకట్ట శ్రీశక్తి పీఠంలో వెలసిన గణపతి మంగళవారం శ్వేతవారాహి గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా గణపతి హోమం నిర్వహించారు. ఆలయానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు.

క్షణం ఆలోచించు.. చిరకాలం జీవించు

రామచంద్రాపురం, సెప్టెంబరు 10: యువత క్షణం ఆలోచించి చిరకాలం జీవించాలని ఎస్‌ఐ రామాంజనేయులు అన్నారు. వెంకట్రామపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మశీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ సూసైడ్ నివారణ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్‌ఐ మాట్లాడుతూ క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, దీంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు మాట్లాడుతూ వివిధ కారణాలతో యువత ఆత్మహత్యకు పాల్పడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చుతున్నారన్నారు. కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పృథ్వీరాజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల సమస్యలు పరిష్కరించండి



ఈవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నేతలు

తిరుమల, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): టీటీడీ పరిపాలన భవనం ఎదురుగా గత 21వ రోజులుగా నిరసన దీక్షలు కొనసాగిస్తున్న శ్రీవారిమెట్టు చిరువ్యాపారులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి టీటీడీ ఈవో శ్యామలరావుకు విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ నేతలు మంగళవారం ఈవోను కలిసి శ్రీవారిమెట్టు చిరువ్యాపారుల సమస్యలను ప్రస్తావించారు. ఈసందర్భంగా కందారపు మురళీ మాట్లాడుతూ.. శ్రీవారిమెట్టు నడకదారిలోని చిరువ్యాపారులతో యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి సమంజసంగా లేదని, పేదకుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అలిపిరి నడకమార్గంలో చిరుత కనపడితే శ్రీవారిమెట్టు నడకమార్గంలో వ్యాపారాలను నిషేధించడం ఏం న్యాయమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, టీటీడీ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి జయచంద్ర పాల్గొన్నారు.

వైభవంగా కట్ట పుట్టాలమ్మ జాతర



విశేష అలంకరణలో కట్ట పుట్టాలమ్మ

రేణిగుంట, సెప్టెంబరు 10: కరకం బాడి పంచాయతీ పరిధిలో వెలసిన గ్రామదేవత కట్ట పుట్టాలమ్మ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభ మైంది. ఉదయం ఆలయంలోని మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కట్ట పుట్టాలమ్మను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున ఆలయం వద్దకు చేరుకుని కట్ట పుట్టాలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.



పొంగళ్లు పెడుతున్న భక్తులు

బంగారం విక్రయిస్తానంటూ బురిడీ : యువకుడి అరెస్టు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10: బంగారం విక్రయిస్తా నంటూ బురిడీ కొట్టించిన హేమచంద్రారెడ్డి(35) అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన హేమచంద్రారెడ్డి ఓ ప్రైవేటు సంస్థలో బంగారు ఆభరణాలను ఏడాది క్రితం తనఖా పెట్టాడు. వాటిని విడిపించి విక్రయించేందుకు తిరుపతికి చెందిన ప్రైవేటు సంస్థ నిర్వాహకులతో ఫోన్‌లో ఒప్పందం చేసుకున్నాడు. ఆ ప్రకారం వారి ద్వారా రెండు నెలల క్రితం రూ.2లక్షల నగదు తీసుకుని బంగారాన్ని విడిపించకుండానే పరారయ్యాడు. తిరుపతికి చెందిన ప్రైవేటు సంస్థకు చెందిన నిర్వాహకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అప్పటి నుంచి యువకుడు పరారీలో ఉన్నాడు. ఇటీవల మరో రెండు ప్రైవేటు సంస్థలను బంగారం విక్రయిస్తానని నమ్మించి నగదు తీసుకుని మోసం చేశాడు. బాధితులు శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు మంగళవారం హేమచంద్రారెడ్డి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పాస్‌లో సీఎం దంపతుల వివాహ దినోత్సవం



తిరుపతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు వివాహ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ నాయకుడు పొరకం వెంకటేష్ మంగళవారం పాస్ మానసిక దివ్యాంగుల కేంద్రంలో కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే చంద్రబాబు, ఆయన వెన్నంటే ఉండే భువనేశ్వరమ్మ వివాహ దినోత్సవాన్ని దివ్యాంగుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఇనుగొండ బాబు, జడపల్లి చిన్ని, ఆముదాల గిరిబాబు, కోటేశ్వర్ రెడ్డి, అద్దంకి బాబు, పానగం గిరి, మురళిలు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుందాం



అంబేడ్కర్ విగ్రహంవద్ద ధర్నా చేస్తున్న కార్మిక, రైతు సంఘాలు

తిరుపతి, (ఆటోనగర్) సెప్టెంబరు 10: ఆంధ్రుల హక్కుగా చరిత్రగాంచిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం కాకుండా కాపాడుకోవడానికి కార్మికులు, రైతులు పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక, కర్షక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎ.రామానాయుడు, పి.మురళి, ఎన్.డి.రవి, కందారపు మురళి, పి.హేమలతలు మాట్లాడుతూ... విశాఖ ఉక్కు కర్మాగారం కోసం జరిగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణత్యాగం చేసిన విషయాలను గుర్తు చేశారు. కేంద్రంలో వున్న బీజేపీ ప్రభుత్వం మూడవ పర్యాయం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రైవేటీకరణ ప్రయత్నాలు ముమ్మరం చేస్తుందని మండిపడ్డారు. ఉక్కు కార్మికులు వీఆర్ఎస్‌లో వెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం రూ.1210 కోట్లు కేటాయించడమే ఇందుకు నిదర్శనమని వారు వెల్లడించారు. ఇంత జరుగుతున్న రాష్ట్రంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలు, ఎంపీలు స్పందించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రజలు విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయకుండా ఉద్యమాలకు సిద్ధంకావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.నాగరాజు, వేణుగోపాల్, విశ్వనాథం, కె.వై.రాజా, సి.హెచ్.శివకుమార్,శ్రీరాములు, రమేష్, శివ, బుజ్జి, మంజుల పాల్గొన్నారు.

విశ్వనాథ సత్యనారాయణకు నివాళి



తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 10: జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, దివంగత విశ్వనాథ సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని రాముల వారి దక్షిణ మాడవీధిలోని ఆధ్యాత్మిక కేంద్రం వద్ద పలువురు విశ్వనాథ చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు చిత్రపు హనుమంతరావు, బ్రాహ్మణ కోఆపరేటివ్ బ్యాంకు తిరుపతి బ్రాంచి ఉద్యోగి పీఆర్ఆర్ కుమార్, అర్ధం బ్రాహ్మణ కార్యదర్శి సీఆర్‌కే శేషగిరిరావు, భాగవతుల జయలక్ష్మి, చావలి రాజ్యలక్ష్మి, సి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్టాటిస్టిక్స్‌తో ఉపాధి అవకాశాలు



శ్రీనివాసన్‌ను సన్మానిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10: స్టాటిస్టిక్స్‌తో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు. మంగళవారం సెనేట్ హాల్లో నిర్వహించిన స్టాటిస్టిక్స్ సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. స్టాటిస్టిక్స్ నిపుణులు పద్మవిభూషణ్ సీఆర్ రావు అనేక సార్లు యూనివర్సిటీని సందర్శించారని తెలిపారు. స్టాటిస్టిక్స్ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత అవకాశాలు పొందాలని కోరారు. ఈసందర్భంగా గణిత నిపుణులు ప్రొఫెసర్ శ్రీనివాసన్‌ను సన్మానించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మహత్య పరిష్కారం కాదు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10: జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని పలువురు విద్యార్థినులు అభిప్రాయపడ్డారు. ఆత్మహత్య నివారణ దినం సందర్భంగా పద్మావతి మహిళా యూనివర్సిటీ సైకాలజీ విభాగంలో వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. సుమారు 50 మంది విద్యార్థినులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతగా హోంసైన్స్ హెడ్ ప్రొఫెసర్ బిందు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 10: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన మంగళవారం టీడీపీ రాష్ట్ర నేత, క్లస్టర్ ఇంచార్జి బుల్లెట్ రమణ ఆధ్వర్యంలో 24వ డివిజన్ ఇందిరానగర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, దంపూరి భాస్కర్‌యాదవ్ హాజరయ్యారు. నాయకులు మేడికుర్తి విశ్వనాథం, పి.రాజారామ్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రుయాస్పత్రి ముందు అన్నదానం



రోగులకు అన్నదానం చేస్తున్న కేతన్ శివ ప్రీతమ్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 10: చిత్తూరు మాజీఎంపీ శివప్రసాద్ అల్లుడు, వీఎం కన్‌స్ట్రక్షన్స్ అధినేత గుంతాటి వేణుగోపాల్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా వీఎం గ్రూప్ అధినేత కేతన్ శివప్రీతమ్ మంగళవారం రుయాస్పత్రి ముందు భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 500 మందికి పైగా రోగులకు ఆయన స్వయంగా అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో కృత్తిక, శ్రీనివాస్ రాయల్, ఉమాశంకర్, రఫీ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10: తిరుపతి రైల్వే స్టేషన్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వృద్ధుడు కదులుతున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరరెడ్డి కథనం మేరకు...సుమారు 65 సంవత్సరాలు వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి తిరుపతి-విశాఖపట్నం స్పెషల్ రైలు కదులుతుండగా అకస్మాత్తుగా రైలు కింద దూరి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతి చెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఇతడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే ఎస్ఐ ధర్మేంద్రరాజు 86885 46060 నెంబరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంస్కృతిక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 10: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఈ 27వ తేదీన నిర్వహించే జాతీయ, రాష్ట్ర యువజనోత్సవాలలో భాగంగా సాంస్కృతిక పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో మొదటిస్థానంలో నిలిచినవారికి రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు అవకాశం లభిస్తుంది. జానపద నృత్యాలు, గీతాల పోటీలకు 15నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగినవారు అర్హులు. ఈనెల 20లోపు జనన, ఆధార్, పోటీచేసే అంశాలతో దరఖాస్తులను సెట్విన్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం 0877-2286921, 7036428762 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

పీఎంశ్రీని సద్వినియోగం చేసుకోండి

- మేలైన బోధనతో విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి



విద్యాశాఖాధికారులతో సమావేశమైన కలెక్టర్, డీఈవో

తిరుపతి(విద్య), సెప్టెంబరు 10: ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. డీఈవో శేఖర్‌తో కలిసి మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో విద్యాశాఖాధికారులతో సమావేశమై పీఎంశ్రీ పథకంపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని 40 పాఠశాలలు పీఎంశ్రీ పథకానికి ఎంపికకాగా మొదటి విడతగా 23 పాఠశాలల్లో ఈ పథకం కింద వసతుల కల్పన సాగుతోందని చెప్పారు. ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షల నిధులతో వసతులు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. పథకం ద్వారా మేలైన బోధన, వసతులతో విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని ఆయన విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో బెస్ట్ ప్రాక్టీస్‌లను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందేలా స్టూడెంట్స్ క్లబ్, ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల్లో స్కౌట్స్, ఎన్‌సీసీ వంటి భావజాలాన్ని పాదుకొల్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి, నోడల్ అధికారి పీఎం శివశంకర్, ఉప విద్యాశాఖాధికారులు శాంతి, ప్రభాకర్‌రెడ్డి, బాలాజీ, ఎస్ఎస్ఏ సెక్టోరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాధు సుబ్రమణ్య శాస్త్రి పరిపూర్ణ జీవి



సాధు సుబ్రమణ్యశాస్త్రి విగ్రహం వద్ద నివాళి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబర్ 10: టీటీడీ శాసనాలను దీక్షతో పరిష్కరించిన సాధు సుబ్రమణ్య శాస్త్రి పరిపూర్ణమైన జీవితం గడిపిన వ్యక్తిగా పలువురు వక్తలు పేర్కొన్నారు. సాధు సుబ్రమణ్య శాస్త్రి 43వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం అన్నమాచార్య కళామందిరంలో టీటీడీ ఆధ్వర్యంలో సాహిత్య సభ జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన మహిళా వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమ మాట్లాడుతూ... సాధు సుబ్రమణ్యశాస్త్రి వంటి వారి జీవితాలు యువతకు ఆదర్శప్రాయంగా ఉంటాయన్నారు. ఆలయ చరిత్రను శాసనాల ద్వారా నిరూపించిన గొప్ప వ్యక్తి శాస్త్రి అని కొనియాడారు. జాతీయ సంస్కృత వర్సిటీ విశ్రాంత ఆచార్యులు కొంపెల్లె రామసూర్యనారాయణ మాట్లాడుతూ... శ్రీవారి ఆలయానికి తాళ్లపాక వారి సేవలను శాసనాల ద్వారా గుర్తించిన శాస్త్రి అనేక విషయాలను లోకానికి తెలియజేశారన్నారు. ప్రముఖ పరిశోధకులు సౌరకాయల కృష్ణారెడ్డి(గోపీకృష్ణ) మాట్లాడుతూ... వేయికి పైగా ఉన్న ఆలయ శాసనాలను పరిష్కరించి వేంకటేశ్వరస్వామి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాధు సుబ్రమణ్యశాస్త్రి కుమార్తె గిరిజ, మనవడు, సీబీఐ జడ్జి సీఎస్ మూర్తి, టీటీడీ డీఈవో నాగరాజ నాయుడు, ప్రముఖ విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణ శర్మ, అన్నమాచార్య వంశీకులు హరినారాయణాచార్యులు, ప్రచురణల విభాగం ఉప సంపాదకులు నరసింహాచార్యులు, డీపీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోకిల, ఇతర అధికారులు, విద్యార్థులు, నగరవాసులు పాల్గొన్నారు. అంతకు ముందు వీరు శ్వేత భవనం వద్ద ఉన్న సాధు సుబ్రమణ్యశాస్త్రి విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.

గౌరిపెద్ది రామసుబ్బశర్మకు నివాళి

టీటీడీలో విశేష సేవలు అందించిన గౌరిపెద్ది రామసుబ్బశర్మ జయంతిని టీటీడీ ఘనంగా నిర్వహించింది. మంగళవారం ఉదయం స్థానిక ప్రాచ్య కళాశాలలోని గౌరిపెద్ది విగ్రహానికి అధికారులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సాయంత్రం ఆరుగంటలకు అన్నమాచార్య కళామందిరంలో జరిగిన సాహిత్యసభకు స్విమ్స్ సంచాలకులు ఆర్వీ కుమార్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ... అన్నమాచార్యుల సంకీర్తనలను పరిష్కరించడంలో గౌరిపెద్ది రామసుబ్బశర్మ కృషి గొప్పదన్నారు. అనంతరం ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు కె.సర్వోత్తమరావు, శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ, ప్రముఖ నాట్యకళాకారిణి, పవని శ్రీలలితాప్రసాద్ (హైదరాబాదు)లు గౌరిపెద్ది రామసుబ్బశర్మ సాహితీ వ్యాసంగాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సభలో ప్రముఖ వాగ్గేయ కారుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, గౌరిపెద్ది వారి కుమారుడు శంకర భగవాన్, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణశర్మ తదితరులు పాల్గొన్నారు.



గౌరిపెద్ది రామసుబ్బశర్మ విగ్రహం వద్ద నివాళి

నిర్విరామంగా సేవలందించిన నిమజ్జన కమిటీ, పోలీసులు



తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 10: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన నిమజ్జన కార్యక్రమం మంగళవారం 1.50గంటల వరకు నిర్విరామంగా కొనసాగింది. ఐదో రోజు బుధవారం కూడా నిమజ్జన కార్యక్రమానికి దాదాపు 250 పైగా విగ్రహాలు తరలిరానున్నాయి. నిమజ్జన కార్యక్రమంలో నిర్విరామంగా సేవలు అందించిన వారిలో సీఐలు రాంకుమార్, అజయ్‌కుమార్, తమీమ్ ఆరీఫ్, వినోద్, కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు భానుప్రకాస్‌రెడ్డి, కరాటే శ్రీనివాస్, గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఎస్వీఎం వెంకటేష్, ఆకుల సతీష్, చెన్నం నవీన్, ఆనంద్‌రెడ్డి, బాబు, వంశీరాయల్, వెంకటేష్, చెంగారెడ్డి, శేఖర్, వేణుగోపాల్ నాయుడు, హేమకిరణ్, హరి, కల్యాణ్, మణికంఠ, వాసు, అనిల్, చెంగారెడ్డి, ఆనంద్, నవీన్ రాయల్, వంశీ, మునిరత్నం, సుబ్రమణి, రెడ్డిబాబు, నాగేశ్వరరావు, రోషన్, కీర్తి వెంకయ్య, సుబ్రహ్మణ్యరెడ్డి తదితరులున్నారు. మండప నిర్వాహకులందరూ బుధవారం సాయంత్రం 6గంటలకల్లా వినాయకసాగర్‌లో నిమజ్జన కార్యక్రమానికి తరలిరావాలని సామంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

అక్కారంపల్లిలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 10: తిరుపతి నగర పరిధిలోని అక్కారంపల్లి ఒకటవ డివిజన్‌లో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని స్థానిక టీడీపీ నాయకుడు నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మబ్బు దేవనారాయణరెడ్డి, బీజీ కృష్ణయాదవ్, మహేష్‌యాదవ్, రాజారెడ్డి, శివశంకర్ రెడ్డి, ధోని, రవిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుయా హెచ్‌డీఎస్ సభ్యుడిగా బండ్ల లక్ష్మీపతి

కలెక్టర్ అనుమతితో ఉత్తర్వులిచ్చిన సూపరింటెండెంట్

తిరుపతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీఆర్ రుయా ఆస్పత్రి హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్) సభ్యుడిగా బండ్ల లక్ష్మీపతిని నియమిస్తూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు ఉత్తర్వులిచ్చారు. హెచ్‌డీఎస్‌కు చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ వెంకటేశ్వర్ అనుమతి మేరకు బండ్ల లక్ష్మీపతిని నియమిస్తూ ఈనెల 6న రుయా సూపరింటెండెంట్ అతడికి ఉత్తర్వు కాపీని అందజేశారు. మంచి రోజు చూసుకుని బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా స్థానిక జనసైనికుల్లో అసంతృప్తి సెగలు చెలరేగాయి. జూలై మొదటివారంలో బండ్ల లక్ష్మీపతి నియామకంపై విమర్శలు రావడంతో తాత్కాలికంగా బ్రేక్ పడిన విషయం తెలిసిందే. తాజాగా అతడికి ఉత్తర్వు లేఖ కూడా చేరడంతో మరోసారి వివాదం చెలరేగింది. ఎన్నికలకు ముందు జనసేన పార్టీలో చేరిన వైసీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు బండ్ల లక్ష్మీపతికి తొలి నామినేటెడ్ పదవి ఎలా ఇస్తారని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. అయితే గత రెండు నెలలుగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతోపాటు సభ్యత్వ నమోదులో మెరుగైన ఫలితాలు చూపించడంతో స్థానిక నాయకత్వం కూడా అతడివైపే మొగ్గు చూపినట్టు తెలిసింది.

చేతివృత్తులతో కుటుంబానికి ఆర్థిక భరోసా



కుట్టుమిషన్ సామగ్రిని మహిళలకు అందజేస్తున్న నాగరాజు

తిరుపతి, (ఆటోనగర్), సెప్టెంబరు10: మహిళలు చేతివృత్తుల్లో నైపుణ్యాన్ని పెంచుకోవడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవచ్చని రాస్ డైరెక్టర్ వి.నాగరాజు పేర్కొన్నారు. స్థానిక కొర్లగుంటలోని రాస్ క్లస్టర్‌లో మంగళవారం పొదుపుసంఘాల మహిళలకు నాలుగు నెలల పాటు నిర్వహించే ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శిక్షణ పొందిన వారు చిన్న చిన్న యూనిట్లు స్థాపించి ఆర్థికంగా ఎదగాలని కోరారు. కుట్టు శిక్షణకు అవసరమైన మెటీరియల్‌ను మహిళలకు అందజేశారు. సిబ్బంది నాగేశ్వర్, రామాంజులు, ధర్మారెడ్డి, నాగవేణి మహిళలు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను హేళనగా మాట్లాడిన హెడ్‌నర్సుపై చర్యలు తీసుకోవాలి



తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 10: వైద్య శాఖలో ఎన్నో సేవలు అందిస్తున్న ఏఎన్‌ఎంలను కించపరుస్తూ హేళనగా మాట్లాడిన హెడ్ నర్సు చంద్రకళపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఎన్ఎం, ఎంపీహెచ్ఏలు మంగళవారం రుయాస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఎన్ఎం నుంచి జీఎన్ఎం ఇన్‌సెంటిఫైడ్ శిక్షణ తీసుకుంటున్న ఏఎన్‌ఎంలకు రూ.5 వేల పారితోషికంతో సేమ్ క్యాడర్‌తోనే సేవలందించాలని ప్రభుత్వం 115 జీవోను విడుదల చేసిందని చెప్పారు. కానీ ఇంతటి శిక్షణ పొందుతున్న తమను పని చేతకాదని, కనీస విద్యార్హత కూడా లేదని హేళన చేస్తూ రుయాస్పత్రి హెడ్‌నర్సు చంద్రకళ మీడియా ముందు మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆమెపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై వారు సూపరింటెండెంట్ రవిప్రభును కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన ఆయన దీనిపై విచారించి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2 అధికారిని ఆదేశించారు.

స్విమ్స్ పరిపాలనా పదవుల్లో బీసీలను నియమించాలి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు),సెప్టెంబరు10:స్విమ్స్ పరిపాలనా పదవుల్లో కీలకమైన రిజిస్ట్రార్, డీన్, మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ తదితర పదవులలో బీసీ ప్రొఫెసర్లను నియమించాలని వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్‌ను ఏపీ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నారాయణ గౌడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం వీసీకి ఆయన వినతిపత్రం అందచేశారు. ఏడాది నుంచి ఖాళీగా ఉన్న బీసీ లైజనింగ్ అధికారిని నియమించాలని ఆయన కోరారు.

వాహనాల ప్లేట్ల ఫిరాయింపు

నెంబరు ప్లేట్లు లేని వాహనాల్లో యువత హల్‌చల్



నెంబరు ప్లేట్లు లేని ఆటోలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10: ద్విచక్ర వాహనాలు, ఆటోలు, జీపులు నెంబరు లేని ప్లేట్లతో తిరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. లీలామహల్ సర్కిల్ నుంచి కపిలతీర్థం, చెర్లోపల్లి బైపాస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండు, రేణిగుంట రోడ్డు, 150 బైపాస్ రోడ్డు, దేవేందర్ థియేటర్ రోడ్డు, బాలాజీ కాలనీ, ఎంఆర్ పల్లి సర్కిల్ తదితర ప్రాంతాల్లో కొందరు యువకులు, మందుబాబులు నెంబరు లేని ప్లేట్లు, జిగ్‌జాగ్‌గా వున్న నెంబరు ప్లేట్లతో విచ్చలవిడిగా హల్‌చల్ చేస్తున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు అమర్చాల్సి వున్నా కొందరు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఎక్కడైనా ప్రమాదం జరిగి వాహనం వెళ్లిపోయినా దాని వివరాలు తెలుసుకోవడం కష్టంగా మారింది. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.



ఆటోకు అస్పష్టంగా ఉన్న నెంబరు

నిబంధనలు ఇవీ....

2018-19 సంవత్సరం నుంచి షోరూములలో వాహనాలు కొన్నవారు తప్పనిసరిగా ప్రభుత్వం అందించే హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లను మాత్రమే బిగించుకోవాలన్న నిబంధన అమల్లోకి వచ్చింది. చాలా మంది వీటిని పట్టించుకోవడంలేదు. నెంబరు ప్లేట్లను సంబంధిత వాహన విక్రయదారులే సమకూరుస్తున్నా కొన్ని కొత్త వాహనాలకు ఈ నిబంధనలు అమలు కావడంలేదు. నెంబరు ప్లేట్లు సరిగా లేని వాహనాలకు రూ.150 జరిమానా విధిస్తారు. రెండోసారి పట్టుబడితే రూ.400 అపరాధ రుసుం వసూలు చేస్తారు. మినీ వ్యాన్లు, లారీలకు రూ.400 జరిమానా విధించాలి.

క్రేజీ యూత్ అన్నదానం



తిరుపతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక 44వ డివిజన్ సుందరయ్య నగర్లో క్రేజీబాయ్స్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు పాల్గొని అన్నదాన వితరణ చేశారు. అనంతరం వీరిని ఆ పార్టీ నాయకులు ఊట్ల సురేంద్ర నాయుడు, చినబాబు, మునిశేఖర్ రాయల్, ఆర్సీ శ్రీనివాసులు శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో స్థానిక యువత ఉదయ్, ధనుంజయ్, శివానందం, విగ్నేష్, సాయికుమార్, జయంతి, వాణి, వెంకటముని, రమేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో అశ్లీల నృత్య ప్రదర్శనలు

ఏడుగురిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 10: వినాయక చవితి ఉత్సవాల్లో అశ్లీల నృత్య ప్రదర్శనలు చేయించిన ఏడుగురు నిర్వాహకులపై అలిపిరి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన వివరాల మేరకు... సప్తగిరినగర్ వినాయక స్వామి మండపం వద్ద కొందరు యువతులతో అశ్లీల నృత్య ప్రదర్శన చేయించినట్లు ప్రచారం జరగడంతో నిర్వాహకులు మధుసూదనరెడ్డి, ఎం.రాజేంద్రప్రసాద్, ఎం.వినోద్‌కుమార్, జి.కిరణ్‌కుమా ర్, జశ్వంతరెడ్డి, పి.వినయ్, హేమంత్‌లను అరెస్టు చేశారు.

ఎన్నాళ్లీ నరకయాతన?

- రైల్వేగేటు పడితే వాహన చోదకులకు చుక్కలే
- అండర్ బ్రిడ్జి నిర్మాణ జాప్యంతో తప్పని అవస్థలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10: దశాబ్ద కాలం నుంచి సూళ్లూరుపేట నియోజకవర్గ కేంద్రం నడిబొడ్డున ఉన్న రైల్వేగేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం వాహన చోదకులకు, ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతోంది. రాకపోకలకు నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రతి ఐదు నిమిషాలకొకసారి రైల్వే గేటు పడుతుండడంతో ఇరువైపులా వాహనాలు బారులు తీరుతున్నాయి. గేటు వేస్తే ఒక్కోసారి పది నుంచి 30 నిమిషాల వరకు తెరుచుకోవడం లేదు. దీంతో ఇరువైపులా వాహన చోదకులకు అవస్థలు తప్పడం లేదు. ప్రధాన వ్యాపార కూడలి ప్రాంతాలన్నీ ఈ గేటుకు రెండు వైపులా ఉండడం ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో అత్యవసర సమయాల్లో కూడా నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

సూళ్లూరుపేట పట్టణం ఇటు పారిశ్రామికంగా, జనాభా పరంగా రోజురోజుకు విస్తరిస్తోంది. పట్టణాన్ని చీల్చుకుంటూ రైల్వే లైను వెళ్తోంది. పట్టణానికి తూర్పు వైపే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలతో పాటు, ప్రైవేటు వైద్యశాలలు, పాఠశాలలు, షార్ ఉద్యోగుల కాలనీలన్నీ ఉన్నాయి. వీరందరూ నిరంతరం చిన్నపాటి పనికోసం కూడా ఈవైపే రావాల్సి ఉంది. అదే విధంగా వ్యాపారస్తులు చెన్నైకి వెళ్లాలన్న ఈ గేటు దాటాల్సి ఉంది. రోజురోజుకు పెరుగుతున్న రైళ్ల రాకపోకలు కూడా ఒక శాపంగా వాహనచోదులకు మారింది. ఉదయం, సాయంత్రం సమయాల్లో కంపెనీలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం రైల్వేగేటు వద్ద నరకం అనుభవిస్తున్నారు. మూడేళ్ల క్రితం రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాదాపు ఆరు నెలలు పనులు జరిగాయి. భూమి నుంచి నీళ్లఊరడం, సిల్టు కావడంతో పనులను ఆపేశారు. అప్పటి నుంచి అండర్ బ్రిడ్జికి తెచ్చిన దిమ్మెలు రోడ్డు పక్కనే రైల్వే అధికారులు వదిలేసి వెళ్లారు. ఈ దిమ్మెలు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో వాహన చోదకులు గేటు వేసి తీసిన సమయంలో ఇరుకు దారిలో ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు గాని, మున్సిపాలిటీ వారు గాని కనీసం రోడ్డుకు అడ్డంగా ఉన్న దిమ్మెలను తొలిగించపోవడం ఏమిటని ప్రజలు నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగు నెలల క్రితం రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గేటును పరిశీలించి వెళ్లారు. కానీ ఇంత వరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. పట్టణ నడిబొడ్డున ఈ రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే వాహన చోదకులకు పడిగాపుల కాయాల్సిన అవసరం ఉండదు. కూటమి ప్రభుత్వమైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గేటు పడడంతో నిరీక్షిస్తున్న వాహన చోదకులు - గేటు తియ్యడంతో వాహన చోదకుల రద్దీ - రోడ్డుకు అడ్డంగా ఉన్న అండర్ బ్రిడ్జి దిమ్మె

గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 10: స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ జిలానీబాషా మంగళవారం పేర్కొన్నారు. ఒకేషనల్ విభాగంలోని వివిధ కోర్సులకు విద్యాబోధన అందించేందుకు బీటెక్ సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన వారు ఈనెల 19వ తేదీలోగా వివరాలను అందజేయాలన్నారు. వివరాలకు స్థానిక కళాశాలలోని ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

మండల సమావేశంలో ఎమ్మెల్యే విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న విజయశ్రీ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10: పార్టీలకతీతంగా అందరూ కలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎ.అనిల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వ్యవసాయ సీజన్ కావడంతో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువుల మరమ్మతులపై దృష్టి సారించాలని జనవనరుల శాఖ అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. గత ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని కూటమి ప్రభుత్వం గ్రామాల రూపురేఖలను మార్చేందుకు నిధులు కేటాయించిందన్నారు. అధికారులు ఏవైనా సమస్యలుంటే తమకు నివేదిస్తే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తానన్నారు. ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్యే విజయశ్రీని ఎంపీపీ ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలా రాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఏవో కవిత, సీడీపీవో శారదాంబ, ఎంఈవో శ్రీనివాసుల, ఏపీఎం హేమమాలిని, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తొణుకుమాల పొలాల్లో మృతదేహం కలకలం!

చిల్లకూరు, సెప్టెంబరు 10: మండలంలోని తొణుకుమాల సమీపంలోని పొలాల్లో మృతదేహం ఉన్నట్లు మంగళవారం కలకలం రేగింది. ఓ వ్యక్తిని కొట్టి చంపి పొలాల్లో పూడ్చివేశారని గ్రామస్తులు చెబుతున్నారు. తొణుకుమాలలోని మామిడితోటలో కాపలాగా ఉంటున్న అంకయ్య మూడురోజుల క్రితం అతని స్నేహితుడికి తోడుగా తోటలోకి కాపలాకు తీసుకువచ్చాడన్నారు. ఇద్దరు కలిసి సమీప పొలాల్లోని విద్యుత్ స్టార్టర్లను అపహరించి అందులోని రాగి తీగలను విక్రయించేవారన్నారు. అయితే సోమవారం రాత్రి తోటలో వారిద్దరి మధ్య స్వల్ప వివాదం తలెత్తడంతో అంకయ్య అతని స్నేహితుడిపై దాడి చేయడంతో అతనను మృతిచెందడంతో మృతదేహాన్ని తోట సమీపంలోని పొలంలో పూడ్చివేసినట్లు భావిస్తున్నారు. అయితే అంకయ్య పరారీలో ఉండడంతో వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై తోట యజమాని అరుణమ్మ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తహసీల్దారు, వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గుంటను తవ్వలేదని పోలీసులు తెలిపారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



సూచనలిస్తున్న అదనపు జిల్లా జడ్జి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 10: స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా వివిధ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం అన్నారు. మంగళవారం కోర్టు ఆవరణలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాజీమార్గం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చునన్నారు. రాజీ అయ్యే కేసులకు సంబంధించిన కక్షిదారులు లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు సులోచనారాణి, రాజేష్, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేనాడు గంధోత్సవానికి పది ఆర్టీసీ బస్సులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10: వేనాడు దర్గా గంధోత్సవానికి వెళ్లే భక్తుల కోసం 10 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ మల్లికార్జున తెలిపారు. ఈ బస్సులు సూళ్లూరుపేట షార్ వై జంక్షన్, రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతాయన్నారు. బుధవారం సాయంత్రం వరకు ఈ బస్సులు తిరుగుతుంటాయన్నారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా అదనపు సర్వీసులు నడుపతామన్నారు. కాగా గంధోత్సవం సందర్భంగా అధ్వానంగా ఉన్న వేనాడు రోడ్డుకు ఉత్సవ నిర్వాహకులు మట్టిని తోలి మరమ్మతులు చేపట్టారు. అట్టకానితిప్ప నుంచి వేనాడు దర్గా వరకు 10 కి.మీ మేర రోడ్డు గుంతలు పూడ్చారు.

నిమజ్జన వ్యర్థాల తరలింపు



పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వాకాడు, సెప్టెంబరు 10: మండలంలోని తూపిలిపాళెం సముద్ర తీరంలో వినాయక నిమజ్జన కార్యక్రమంలో ప్రతిమల ముక్కలు విరిగిపడి సముద్రం ఒడ్డునే చేరడంతో భక్తులు ఇబ్బందులపై మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'నిమజ్జనానికి వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం' కథనానికి ఎట్టకేలకు అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయం నుంచి పారిశుధ్య పనులను చేపట్టి ఒడ్డున ఉన్న విరిగిపడి ఉన్న ముక్కలను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పనులు చేపడుతున్నామని డీఎల్‌పీవో వెంకటరమణ తెలిపారు. ఎంపీడీవో మనోహర్‌గౌడ్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 10: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఈ 27వ తేదీన నిర్వహించే జాతీయ, రాష్ట్ర యువజనోత్సవాలలో భాగంగా సాంస్కృతిక పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో మొదటిస్థానంలో నిలిచినవారికి రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు అవకాశం లభిస్తుంది. జానపద నృత్యాలు, గీతాల పోటీలకు 15నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగినవారు అర్హులు. ఈనెల 20లోపు జనన, ఆధార్, పోటీచేసే అంశాలతో దరఖాస్తులను సెట్విన్ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం 0877-2286921, 70364 28762 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

స్టాటిస్టిక్స్‌తో ఉపాధి అవకాశాలు

- ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10: స్టాటిస్టిక్స్‌తో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు. మంగళవారం సెనెట్ హాల్లో నిర్వహించిన స్టాటిస్టిక్స్ సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. స్టాటిస్టిక్స్ నిపుణులు పద్మవిభూషణ్ సీఆర్ రావు అనేక సార్లు యూనివర్సిటీని సందర్శించారని తెలిపారు. స్టాటిస్టిక్స్ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత అవకాశాలు పొందాలని కోరారు. ఇందుకు అవసరమైన తోడ్పాటు అందిస్తామని తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మహత్య పరిష్కారం కాదు

ప్రతిభా పోటీల్లో విద్యార్థినుల స్పష్టం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 10: జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని పలువురు విద్యార్థినులు అభిప్రాయపడ్డారు. ఆత్మహత్య నివారణ దినం సందర్భంగా పద్మావతి మహిళా యూనివర్సిటీ సైకాలజీ విభాగంలో వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. సుమారు 50 మంది విద్యార్థినులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతగా హోంసైన్స్ హెడ్ ప్రొఫెసర్ బిందు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సైకాలజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు పటిష్ఠ భద్రత : ఏఎస్పీ

వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 10: పోలేరమ్మ జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అడిషనల్ ఏస్పీ రవి మనోహరా చారి ఆదేశించారు. మంగళవారం పోలేరమ్మ పుట్టినిల్లు, మెట్టినిల్లు, అమ్మవారి ఆలయం, నిమజ్జన ప్రాంతాలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. అమ్మవారి దర్శనార్థం భక్తులు పోటెత్తుతారని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చోరీలు, గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గత ఏడాది జాతర పుటేజీలు వీక్షించి తదనుగుణంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీఎస్పీ రమణ, సీఐ ఏ.వీ. రమణ, ఎస్ఐ గోపీ, ఏఎస్ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎస్పీ రవి మనోహరాచారి

జాతీయస్థాయి హాకీ పోటీలకు గూడూరు క్రీడాకారులు

గూడూరు, సెప్టెంబరు 10: జాతీయస్థాయిలో జరిగే జూనియర్ పురుషుల హాకీ క్రీడా పోటీల్లో గూడూరు క్రీడాకారులు పాల్గొననున్నట్లు తిరుపతి శాప్ హాకీ కోచ్ దీపక్‌ఆకాష్ మంగళవారం తెలిపారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో ఈనెల 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరగనున్న 14వ జాతీయస్థాయి జూనియర్ పురుషుల హాకీ ఆంధ్రా జట్టుకు గూడూరుకు చెందిన క్రీడాకారులు లక్ష్మీవరప్రసాద్, భార్గవ్ ఎంపికయ్యారని కోచ్ పేర్కొన్నారు.

ఐలమ్మకు ఘన నివాళి



గూడూరు, కోట పట్టణాల్లో జరిగిన వర్ధంతి కార్యక్రమాలు

గూడూరు అర్బన్/ కోట, సెప్టెంబరు 10: గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమెకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి మహిళా ఉద్యమనేతగా ఐలమ్మ గుర్తింపు పొందారన్నారు. రజాకార్ల దురాగతాలపై అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. నేటి యువత ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, కాలేషా, చంద్రయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు. కోట పట్టణంలోని బజారుసెంటర్‌లో మంగళవారం తెలంగాణ ఉద్యమకారి చాకలి ఐలమ్మకు రజక సంక్షేమ సంఘం తరపున నివాళులర్పించారు. కె.జగదీష్ ఆధ్వర్యంలో తమ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు కాంస్య పతకం



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, సెప్టెంబరు 10: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి మహిధర్‌రెడ్డి ఎన్‌సీసీ నావెల్ రింగ్‌లో కాంస్య పతకాన్ని సాధించడంతో మంగళవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు అభినందించారు. ఆల్ ఇండియా నౌ సైనిక్ క్యాంప్‌లో నావెల్ స్పెషలైజ్డ్ సబ్జెక్టులో హెల్త్ అండ్ హైజీన్‌లో కాంస్య పతకం సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ హరనాథ్‌రెడ్డి తెలిపారు.

అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పది

- ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెంబరు 10 : అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తొలిమిట్టిలో నిర్వహించిన అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. దైవ కార్యక్రమంతో పాటు స్వామి వారి ప్రసాదంగా అన్నదానం నిర్వహించి పేదల ఆకలి తీర్చిన నిర్వాహకులను ఆయన అభినందించారు. జి.మురళి, బి. రాజేశ్వరరావు, కేవీకే ప్రసాదనాయుడు, వెంకటముని, మంకు ఆనంద్, సుబ్బుయాదవ్, హేమంత్ చౌదిరి, నాని, చంటి, నిర్వాహకులు సాయి, దనుంజయ పురుషోత్తం, ఉమా, నాదముని, మురళి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జాతీయ రహదారి కూడలి వద్ద ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద మంగళవారం అన్నదానం జరిగింది. ముందుగా నిర్వాహకులు వినాయకస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా పట్టణ, మండలంలోని పలు వినాయక ప్రతిమల వద్ద నాలుగో రోజు ఉట్టి కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

నాయుడుపేట, సెప్టెంబరు 10: ప్రాణాంతకమైన ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, ప్రాజెక్టు మేనేజర్ బాలాజీరాజు అన్నారు. నాయుడుపేట విక్రమ్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాప్తికి కారకాలు, వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎయిడ్స్ అంటువ్యాధికాదని వ్యాధిగ్రస్తుల పట్ల కరుణతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ కళాశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ నరేంద్ర, నవజీవన్ సిబ్బంది ఉన్నారు.

బలిజల అభివృద్ధికి కృషి



వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 10: బలిజ సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని శ్రీ కృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు టీటీ మణి అన్నారు. మంగళవారం కోమల 70ఎంఎంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సంఘ సభ్యుల పెళ్లిళ్లకు తాళి బొట్టు ఉచితంగా అదిస్తామన్నారు. విద్య, వైద్యానికి ఆర్థిక సాయం అందిస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టి.మణి, ప్రధాన కార్యదర్శిగా జి.మనోజ్, గౌరవాధ్యక్షుడిగా గోపాల్, కోశాధికారిగా బి.వసంత్ సమా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

పోలేరమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు



జాతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 10: వెంకటగిరి పోలేరమ్మ జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. జాతరకు బుధవారం చాటింపు వేయనున్న నేపథ్యంలో మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.జాతరలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా అన్ని చర్యలూ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని సూచించారు. పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. క్యూలైన్లలో తొక్కిసలాటలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అందుబాటులో ఉండేలా అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని ఆరోగ్యశాఖాధికారులకు సూచించారు. తాగునీరు, శానిటేషన్, పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు జనరేటర్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఫైర్ సేఫ్టీ, బారికేడ్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ అనౌన్స్‌మెంట్, రవాణా సౌకర్యాలు, సహాయ కేంద్రాల ఏర్పాట్ల విషయంలో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో కిషోర్, ఏఎస్పీలు రాజేంద్ర, రవి మనోహరాచారి, జిల్లా దేవదాయ శాఖ అధికారి రామకృష్ణారెడ్డి, డీఎంహెచ్‌వో శ్రీహరి, పోలేమ్మ ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న చవితి వేడుకలు



నాయుడుపేట, సెప్టెంబరు 10 : వినాయక చవితి పండగ పర్వదినాలలో భాగంగా 4వ రోజు మంగళవారం చవితి వేడుకలు వైభవంగా కొనసాగాయి. స్థానిక అమరాగార్డెన్‌లో కేదార్‌నాథ్ గణనాథుని సెట్టింగ్‌తో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమను టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, సుధీర్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు, పల్లకీసేవలో పాల్గొన్నారు. స్థానిక దర్గావీధిలో పొట్లపూడి రాజేష్, మిత్రులు ఏర్పాటు చేసిన వినాయక చవితికి భారీ సెట్టింగ్, భారీ వినాయక ప్రతిమను స్థానిక విజన్ పాఠశాల విద్యార్థులు దర్శించుకున్నారు. పలు వినాయక చవితి ప్రతిమల వద్ద అన్నప్రసాదాలు అందించారు.

నాలుగో రోజు చవితి సంబరాలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 10: చవితి సంబరాలు సూళ్లూరుపేటలో ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం గణనాథుడి ప్రతిమల వద్ద విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం బాపూజీ వీధి, షార్ బస్టాండు, ఇందిరానగర్ వద్ద ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేశారు. యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనం



వాకాడు, సెప్టెంబరు 10 : తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి మంగళవారం తూపిలి పాళెం సముద్ర తీరంలో గణేశ్ ప్రతిమలు నిమజ్జనానికి తరలివచ్చాయి. 4వ రోజు కావడంతో యువత, చిన్నారులు, మహిళలు ట్రాక్టర్లు, మినీలారీలు, తదితర వాహనాల్లో సముద్ర తీరానికి చేరుకున్నారు. రంగులు చల్లుకుంటూ నిమజ్జనం నిర్వహించారు. నిమజ్జన ఏర్పాట్లను ఎస్ఐలు నాగబాబు, పవన్‌కుమార్‌లు ప్రశాంతంగా జరిగేలా చూశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగబాబు మాట్లాడుతూ 4వ రోజు కావడంతో 120కి పైగా గణేష్ ప్రతిమలు నిమజ్జనానికి వచ్చాయన్నారు. బుధవారం 5వ రోజు కావడంతో అధిక సంఖ్యలో విగ్రహాలు తరలి వస్తున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజల సౌకర్యాలకు ఏర్పాటు చేసి నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా చూస్తామన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 10: స్థానిక రోటరీభవన్‌లో మంగళవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు నెలకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ప్రతినెలా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, జీజీనాయుడు, మయూరి శ్యామ్‌యాదవ్, దశరథరామిరెడ్డి, కిరణ్‌చక్రవర్తి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం



దుప్పట్ల పంపిణీలో ఎమ్మెల్యే దంపతులు

గూడూరు, సెప్టెంబరు 10: విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సహాయక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం విజయవాడలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఎమ్మెల్యే సొంతనిధుల నుంచి రూ.5 లక్షల విలువైన దుప్పట్లను ఆయన సతీమణి సంధ్యారాణితో కలసి బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదల కారణంగా ఇక్కడ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు అప్రమత్తంగా ఉంటూ, ప్రజల కష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారికి సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలందరూ వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు అండగా నిలవాలని సీఎం ఆదేశాలతో బాధితులకు సరుకులు, దుప్పట్లను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కిషోర్ నాయుడు, నటశేఖర్, బి.ప్రణీత్, ఓంప్రకాష్, సునీల్, కళ్యాణ్, సందీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి లక్ష రూపాయల విరాళం



సీఎంకు చెక్కును అందిస్తున్న ఉద్యోగులు

నాయుడుపేట, సెప్టెంబరు 10: ముఖ్యమంత్రి సహాయనిధికి లక్ష రూపాయల చెక్కును ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తరపున సీఎం చంద్రబాబుకు అందజేసినట్లు నాయుడుపేట ఏపీ గురుకుల పాఠశాల ఉద్యోగి, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. లక్ష్మీనారాయణ తెలిపారు. వరద బాధితుల చేయూత కోసం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. వెంకట్, ప్రవీణ్, జి.వంశీ, రామ్మూర్తినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు ఎదగండి



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

గూడూరు, సెప్టెంబరు 10: విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని జీఎంయూపీ విశ్రాంత హెచ్‌ఎం మేరీ శ్యామసుందరి, హెచ్‌ఎం రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం జీఎంయూపీ పాఠశాలలో 1986-87 విద్యా సంవత్సరంలో 7వ తరగతి చదివిన విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి, భోజన ప్లేట్లు, పాఠశాలకు కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 37 ఏళ్ల క్రితం ఈ పాఠశా లలో చదివి ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడి రాణిస్తున్న పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు ఒక వేదికగా కలవడం ఆనందంగా ఉందన్నారు. ఇదే తరహాలో ప్రస్తుత విద్యార్థులు కూడా కష్టపడి చదివి భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సరదాగా గడిపారు. హెచ్‌ఎంలను సన్మానించారు.

విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానీయం



సీఐటీయూ నాయకుల ధర్నా

గూడూరు, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేస్తే సహించేది లేదని అడ్డుకుని తీరుతామని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం టవర్‌క్లాక్ కేంద్రం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలోని విశాఖ ఉక్కు కర్మాగారానికి విశిష్టత ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నష్టాల్లోకి నెట్టివేసి ప్రైవేటుపరం చేయాలని కుట్రలు పన్నుతోందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకట్రామిరెడ్డి, బీవీ రమణయ్య, సురేష్, శంకరయ్య, సుబ్రమణ్యం, ప్రసాద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని కేంద్రప్రభుత్వం మానుకోవాలని టవర్‌క్లాక్ కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభాకర్, శశికుమార్, చంద్రయ్య, కాలేషా, వెంకటేశ్వర్లు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ మహిళా కార్మికుల ధర్నా



రాయల్ టెక్స్‌టైల్ వద్ద మహిళా కార్మికుల ధర్నా

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 10: ముందస్తు సమాచారం లేకుండా కర్మాగారాన్ని మూసివేయడం తగదని రాయల్ టెక్స్‌టైల్ కర్మాగార మహిళా కార్మికులు వాపోయారు. నాయుడుపేట - మేనకూరు సెజ్‌లోని రాయల్ టెక్స్‌టైల్ కర్మాగారం ఎదుట జరిగిన ధర్నాకు సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులు మాట్లాడుతూ తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ... ఉన్నట్టుండి కర్మాగారాన్ని మూసివేయడంతో కార్మికులు వీధిన పడ్డారన్నారు. సమాచారం అందుకున్న కార్మిక శాఖ అధికారులు డీసీఎల్ వెంకటేశ్వర్లు, ఏసీఎల్ సురేష్ యాజమాన్యంతో మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి వారికి న్యాయం చేయాలని యజమానులకు నోటీసులు జారీ చేశారు.

యాప్‌లలో పొందుపరచండి

కోట సెప్టెంబరు 10: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా జరిగే ప్రతి విషయాన్ని కేటాయించిన ఆయా యాప్‌ల ద్వారా పొందుపరచాలని సీడీపీవో మునికుమారి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ వర్కర్లతో యాప్‌ల డౌన్‌లోడింగ్‌పై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మునికుమారి ఆయా సూపర్ వైజర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ఇచ్చే ఆహారంలో ఎక్కడ తేడాలు ఉండకూడదన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ఉన్న అంగన్‌వాడీలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మ, పద్మమ్మ, శేషమ్మ, తదితరులు ఉన్నారు.



పొంగళ్లు పెడుతున్న భక్తులు

వైభవంగా కట్ట పుట్టాలమ్మ జాతర

రేణిగుంట, సెప్టెంబరు 10: కరకంబాడి పంచాయతీ పరిధిలో వెలసిన గ్రామదేవత కట్ట పుట్టాలమ్మ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం ఆలయంలోని మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కట్ట పుట్టాలమ్మను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున ఆలయం వద్దకు చేరుకుని కట్ట పుట్టాలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.



విశేష అలంకరణలో కట్ట పుట్టాలమ్మ

విధ్వంసమే జగన్ నైజం: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10: విధ్వంసమే జగన్ నైజమని టీడీపీ బీసీ విభాగం నాయకులు అన్నారు. మంగళవారం శ్రీకాళహస్తి పట్టణంలో వారు మీడియాతో మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక ఐదేళ్ల పాటు విధ్వంస పాలన సాగించారని, వైసీపీ నేతల అక్రమాలు, అవినీతి, దుర్మార్గాలు భరించలేక ప్రజలు చిత్తుగా ఓడించినా జగన్‌కు బుద్ధి రాలేదన్నారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగిస్తారని అన్నారు. అధికారాన్ని దూరం చేశారనే కక్షతో ప్రజలపై పగబట్టిన జగన్ లక్షలాదిమంది ప్రజలను జలసమాధి చేయడాలని తన మనుషుల ద్వారా బోట్లను వరద ప్రవాహంలో వదలి ప్రకాశం బ్యారేజీని కూల్చివేయడానికి పన్నాగం పన్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. అధికారంలో ఉండగా వైసీపీ నేతలు బుడమేరును ఆక్రమించుకుని ప్లాట్లు వేసుకుని అమ్మేసిన నేపథ్యంలోనే ప్రస్తుతం విజయవాడ వరదలో చిక్కుకుని ప్రజానీకం విలవిలలాడిందన్నారు. ఇసుక మాఫియా కోసం అన్నమయ్య డ్యామ్‌ను కొట్టుకుపోయేలా చేసి 50మందిని చంపి, ఐదు ఊర్లను నామ రూపాలు లేకుండా చేసిన విషయాన్ని ప్రజలు ఎప్పటికీ మరవరన్నారు. ఇకనైనా స్వార్థరాజకీయాలు మానాలని జగన్‌కు హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మిన్నల రవి, ఉమేష్ రావు, నెమళ్లూరు బుజ్జి, కోట చంద్రశేఖర్, చింతగింజల సునీల్, భాస్కర్, మణి, వంశీ పాల్గొన్నారు.

చీటీ డబ్బులు అడిగినందుకు దాడి

ఏర్పేడు, సెప్టెంబరు 10: చీటీ డబ్బులు అడిగినందుకు దాడి చేసిన ఘటన ఏర్పేడు మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ జయచంద్ర కథనం మేరకు.. పాపానాయుడుపేటకు చెందిన మురగప్ప మొదలియార్ స్థానికంగా చీటీలు వేస్తూ ఉంటాడు. ఆరు నెలల క్రితం 10మంది కలిసి రూ.5లక్షల చీటీ వేశారు. మర్రిమంద గ్రామానికి చెందిన పరశురామ్ మూడు నెలల క్రితం చీటీ పాడుకున్నాడు. అయితే రెండు నెలలుగా డబ్బులు చెల్లించడంలేదు. చీటీ డబ్బు ఇవ్వాలని నిర్వాహకుడు మురగప్ప మొదలియార్ పరశురామ్‌ను అడుగుతున్నా పట్టించుకోకపోవడంతో మంగళవారం సాయంత్రం గట్టిగా నిలదీశాడు. ఈక్రమంలో పరశురామ్‌తో పాటు ఆయన సమీప బంధువు త్యాగరాజులు కలిసి మురగప్ప మొదలియార్‌పై దాడి చేశారు. బాధితుడు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగ మేళాలో 69మంది ఎంపిక

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10: పట్టణంలోని ఎస్సీవీ పురుషుల డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జేకేసీ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన ఉద్యోగ మేళాలలో 69మంది ఎంపికయ్యారు. ఏడు కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 114మంది హాజరు కాగా, 69మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల శ్రీలత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, జేకేసీ కోఆర్డినేటర్ గిరిజ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

బంగారం విక్రయిస్తానంటూ బురిడీ యువకుడి అరెస్టు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10: బంగారం విక్రయిస్తానంటూ బురిడీ కొట్టించిన హేమచంద్రారెడ్డి(35) అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన హేమచంద్రారెడ్డి ఓ ప్రైవేటు సంస్థలో బంగారు ఆభరణాలను ఏడాది క్రితం తనఖా పెట్టాడు. వాటిని విడిపించి విక్రయించేందుకు తిరుపతికి చెందిన ప్రైవేటు సంస్థ నిర్వాహకులతో ఫోన్‌లో ఒప్పందం చేసుకున్నాడు. ఆ ప్రకారం వారి ద్వారా రెండు నెలల క్రితం రూ.2లక్షల నగదు తీసుకుని బంగారాన్ని విడిపించకుండానే పరారయ్యాడు. తిరుపతికి చెందిన ప్రైవేటు సంస్థకు చెందిన నిర్వాహకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. అప్పటి నుంచి యువకుడు పరారీలో ఉన్నాడు. ఇటీవల మరో రెండు ప్రైవేటు సంస్థలను బంగారం విక్రయిస్తానని నమ్మించి నగదు తీసుకుని మోసం చేశాడు. బాధితులు శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ పోలీసులు మంగళవారం హేమచంద్రారెడ్డి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇసుకకు నగదు వసూళ్లపై ఎస్పీకి ఫిర్యాదు

ఏర్పేడు, సెప్టెంబరు 10: ప్రతి ఇసుక ట్రాక్టర్‌కూ డబ్బులు చెల్లించాలని పోలీసులు డిమాండ్ చేస్తున్నారని ఏర్పేడు మండలం వికృతమాలకు చెందిన మాజీ సర్పంచు హేమాక్షి రాయల్ మంగళవారం ఎస్పీ సుబ్బరాయుడుకు వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేశారు. స్వర్ణముఖి నది నుంచి ఇసుక తరలించే ట్రాక్టర్ల నుంచి నగదు డిమాండ్ చేస్తున్నారని హేమాక్షి పేర్కొన్నారు. అయితే నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అడ్డుకోవడంతోనే కొందరు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని పోలీసులు సైతం ఉన్నతాధికారులకు విన్నవించుకోవడం గమనార్హం.

వరద బాధితులకు విరాళాల సేకరణ

సత్యవేడు, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితులకు సహాయార్థం సీపీఎం నాయకులు ఆధ్వర్యంలో మంగళవారం సత్యవేడులో విరాళాలు సేకరించారు. సీపీఎం మండల కార్యదర్శి ఆధ్వర్యంలో పట్టణంలో దుకాణాలు, వ్యాపార సముదాయాల వద్ద జోలె పట్టి తిరిగి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా పోగైన రూ.5983ను పార్టీ కేంద్ర కమిటీకి అందించి, అక్కడ నుంచి సీఎం సహాయ నిధికి సమర్పించనున్నట్లు రమేష్ వెల్లడించారు.

108 వాహనంలో ప్రసవం



సునీత జన్మనిచ్చిన ఆడబిడ్డతో 108 సిబ్బంది

నాగలాపురం, సెప్టెంబరు 10: నాగలాపురం పడమటి దళితవాడకు చెందిన సునీత(24) 108 వాహనంలో ప్రసవించింది. మంగళవారం సునీతకు పురిటి నొప్పులు రావడంతో ఆమె కుటుంబ సభ్యులు నాగలాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు నగరి ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. 108 వాహనంలో నగరి ఆస్పత్రికి వెళ్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువ అవడంతో ఈఎన్టీ నిరోషా కాన్పు చేశారు. సునీత ఆడబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లి బిడ్డను నగరి ఏరియా ఆస్పత్రికి చేర్చామని 108 పైలెట్ సతీష్ తెలిపారు.

రేపు సిద్ధ ఔషధ నేత్ర చికిత్స శిబిరం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 10: మండల కేంద్రంలోని లోకా ఫౌండేషన్(వన్ హ్యుమానిటీ కేర్) ఆధ్వర్యంలో గురువారం కలిక్కం సిద్ధ ఔషధ నేత్ర చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయొద్దు



శ్రీకాళహస్తిలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేయవద్దని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మూడేళ్లుగా కార్మికులు ఆందోళన చేస్తున్నా కేంద్రానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెనగడం గురవయ్య, మురళి, వైఎస్ మణి, గంధం మణి, రాపూరు సుబ్రహ్మణ్యం, వెంకటేష్, వేణు, రాజా, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేయవద్దని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. వరదయ్యపాళెంలో మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు ఆంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ విశాఖ పరిశ్రమను అప్పుల ఊబిలోకి నెట్టి ప్రైవేటు పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తరుణ్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు నాగార్జున, చంద్ర, సిద్ధులయ్య, చంద్రశేఖర్, బాలగురునాథం, కృష్ణమూర్తి, ఆటో యూనియన్ నాయకులు జయరామయ్య, మునిరాజా, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నం విరమించుకోవాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ కోరారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను నిరసిస్తూ సత్యవేడులో సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కావాలనే విశాఖ స్టీల్ ఉత్పత్తి తగ్గించి, పరిశ్రమను నష్టాల్లోకి నెట్టి, ప్రైవేట్‌కు అప్పగించాలని కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఆంధ్రుల ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ స్టీల్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మునస్వామి, తిరుమల, సుశీల, బాబు, ఏళుమలై, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలని హమాలీ కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. మంగళవారం మండల పరిధిలోని పాత విమానాశ్రయం వద్ద సీడబ్ల్యూసీ గోదాములో పనిచేస్తున్న హమాలీ కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు మునిరాజు మాట్లాడుతూ ఉత్పత్తి తగ్గించి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుల హరినాథ్, నరసింహారెడ్డి, శివ, నాగూర్, విజయకుమార్, హమాలి కార్మికులు పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో 13మందికి రిమాండ్

కేవీబీపురం, సెప్టెంబరు 10: మండలంలో రాగిగుంట, పెరిందేశం గ్రామాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో 13మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాగిగుంటకు సంబంధించి ఆరుగురిపై, పెరిందేశానికి సంబంధించిన ఏడుగురిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. వీరందరినీ మంగళవారం శ్రీకాళహస్తి న్యాయస్థానానికి తరలించగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

పాఠశాల బస్సు సమయపాలన పాటించాలి

కేవీబీపురం, సెప్టెంబరు 10: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జడ్పీ ఉన్నత పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం నడుపుతున్న ఆర్టీసీ బస్సు సమయపాలన పాటించాలని విద్యార్థులు కోరుతున్నారు. కేవీబీపురం మండలంలోని వేములపూడి, కళత్తూరు, పాతపాలెం, ఓళూరు, రాయపేడు, కాట్రపల్లి గ్రామాల విద్యార్థులు పాఠశాలలకు వెళ్లి వచ్చేందుకు అనువుగా శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక బస్సును నడుపుతున్నారు. అయితే బస్సు రాకపోకల్లో సమయపాలన లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంగా సాయంత్రం వేళ బస్సు రాక ఆలస్యం అవుతుండడంతో విద్యార్థులు ఆరుగంటలకు ఇంటికి చేరాల్సి వస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు మునిశేఖర్ తెలిపారు. బస్సు సమయపాలన పాటించేలా చూడాలని డిపో మేనేజరుకు వినతిపత్రం సమర్పించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



కూనాటి సురేష్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 10: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కూనాటి సురేష్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన సందర్భంగా మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయనను సన్మానించారు. సురేష్ చేసిన విద్యాసంబంధమైన సేవలను కొనియాడారు. ఇలాంటి నూతన ఒరవడిని అందరూ అలవర్చుకుని విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కూనాటి సురేష్ మాట్లాడుతూ తన ప్రయాణంలో చేసిన డిజిటల్ విద్యను పాఠ్యపుస్తకాల రచనలు, మాడ్యూ రచనలు, యూట్యూబ్ వీడియోలు, ఆన్‌లైన్ క్లాసులు, యాప్‌ల తయారీ గురించి కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డీఈవో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌చే సన్మానం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 10: ఢిల్లీలో ఆగస్టు 15న జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన వరదయ్యపాళెం మండలం సంతవేలూరు తెలుగు ఉపాధ్యాయురాలు ఎన్‌వీ లత, విద్యార్థి ఝాన్సీని మంగళవారం తిరుపతిలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటేశ్వర్ సన్మానించారు.

జీవో 85ను రద్దు చేయండి



కేవీబీపురం పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

కేవీబీపురం, సెప్టెంబరు 10: జీవో 85ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వాణి మాట్లాడుతూ జీవో 85 వల్ల తమ మూడేళ్ల సర్వీసు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పిచ్చాటూరు: స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. జీవో 85ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు హమీద్, మునిచారిత్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు

ఏర్పేడు, సెప్టెంబరు 10: పంగూరు సచివాలయ పరిధిలోని పంగూరు, కేకే గుంట, జంగాలపల్లి, కృష్ణంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ రత్నమ్మ, మహిళా పోలీసు శాంతకుమారి, గౌతమి, ఏఎన్‌ఎం శ్రీదేవి, అంగన్ వాడీలు కవిత, రోహిణి, మీనాక్షి, భూలక్ష్మి, సంపూర్ణ, రాజేశ్వరి, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఊరేగింపు



ఏర్పేడు, సెప్టెంబరు 10: మండలంలోని బాలకృష్ణాపురంలో వినాయకుడి ఊరేగింపు మంగళవారం వేడుకగా జరిగింది. ఊరేగింపు అనంతరం నిమజ్జనం జరిగింది.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 10: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఏఐటీయూసీ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ ప్రధాని మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ స్టీల్ ప్లాంట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైందన్నారు. స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం 73 లక్షల టన్నులు కాగా, గత ఏడాది 45 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేశారని, ప్రైవేటీకరణ కోసమే ఈ విధంగా కుట్ర చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, భాస్కర్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం, దళిత నాయకుడు నందయ్య, వడమాలపేట నాయకులు శ్రీనివాసులు, యానిస్‌భాష, రమేష్, కృష్ణమూర్తి, వెంకటేష్, ధన, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలి



ఎస్‌బీఆర్ పురంలో పోషక పదార్థాలతో పిల్లల తల్లులు

వడమాలపేట, సెప్టెంబర్ 10: అంగన్‌వాడీ పిల్లలకు పోషక విలువలతో రుచికరమైన పదార్థాలను అందించాలని పీడీ జయలక్ష్మి అన్నారు. పోషకాహార మాసోత్సవాల సందర్భంగా ఎస్‌బీఆర్ పురంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. రాగిపిండి, ఆకుకూరలతో పకోడి, రాగి లడ్డు, బాలామృతం కుడుములను తయారు చేయించారు. సీడీపీవో పద్మజ మాట్లాడుతూ తృణధాన్యాలను, ఆకు కూరలను ప్రతిరోజు పిల్లలకు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రోజారమణి, కార్యదర్శి జ్యోష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

పుత్తూరు, సెప్టెంబరు 10: బీజేపీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీష్ కోరారు. నగరి నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా పుత్తూరు పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో సభ్యత్వ నమోదు ప్రక్రియ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరప్రసాద్‌రెడ్డి, పుష్పలత, రమేష్‌నాయుడు, బాబు, హరిబాబు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోనూ అంగన్‌వాడీ సేవలు అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయలక్ష్మి

పుత్తూరు, సెప్టెంబరు 10: ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నివసించే గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ సేవలు సంపూర్ణంగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జయలక్ష్మి ఆదేశించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా పుత్తూరు, వడమాలపేట మండలాల అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం మంగళవారం పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో పద్మజ, సూపర్‌వైజర్లు గీతాంజలి, సంధ్య, మనీలా, అనిత, రోజారమణి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 10: మండల పరిధిలోని గొల్లపల్లి హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచను, చిత్రలేఖనం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు 14వ తేదీన బహుమతులు అందజేస్తామని ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరాములు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 85 వైద్యవృత్తి ప్రగతికి ప్రతిబంధకం



పరమేశ్వరమంగళం పీహెచ్‌పీ ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన

పుత్తూరు/పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 10: వైద్య వృత్తి ప్రగతికి ప్రతిబంధకంగా వున్న జీవో 85ను వ్యతిరేకిస్తూ మంగళవారం పుత్తూరు మండలంలోని గొల్లపల్లి, పరమేశ్వరమంగళం పీహెచ్‌సీలోని వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య మాట్లాడుతూ కొవిడ్ సమయంలో జీవితాలను పణంగా పెట్టి గ్రామీణ ప్రాంతంలో వైద్యసేవలు అందించామని తెలిపారు. ఈ ఉత్తర్వు వల్ల తమ విలువైన మూడేళ్ల సర్వీసు నష్టం పోతామని, పీజీ సీట్లలో 30 నుంచి 15 శాతానికి కుదించడం వల్ల దాదాపు 2500 గ్రామీణ వైద్యులు ఉన్నత స్థాయి చదవులను కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. జీవోను రద్దు చేయకపోతే ఉద్యమాన్ని అంచెలవారీగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సీఐకి సన్మానం



సీఐ సురేంద్ర నాయుడిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 10: పుత్తూరు పట్టణ సీఐ సురేంద్ర నాయుడును టీడీపీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి, శాలువ కప్పి సన్మానించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ ధనపాల్, నాయకులు కేశావచారి, ప్రసాద్ నాయుడు, గోపినాథ్, మురళీకృష్ణ, జయచంద్ర, విక్కీరాయల్, ఈశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవర్క్స్ వస్తువుల పంపిణీ



పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 10: పట్టణంలోని రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో జన్ శిక్షన్ సంస్థాన్ సహకారంతో మంగళవారం రాచపాలెంలో మహిళలకు ఉచితంగా ఆర్యవర్క్స్ వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త రత్నకుమారి, జన్ శిక్షన్ సంస్థాన్ కోఆర్డినేటర్ హరిబాబు, రాస్ అధికారి రవి, ప్రకాష్, దుర్గ, రజని పాల్గొన్నారు.